క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు పట్టణ సీఐ వెంకటరమణ తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో మున్సిపాలిటీ పరిధిలోని రౌడీ షీటర్లను పిలిపించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు నారాయణ రెడ్డి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపునీటితో అవస్థలు



వర్షపునీటిని డ్రైనేజీలోకి మళ్లించేందుకు అవస్థలు పడుతున్న స్థానికులు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతమైన శ్రీకృష్ణ మందిరం ముందు భాగం వర్షపు నీటితో నిండిపోయింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పక్కనే డ్రైనేజీ కాలువ అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్డుకిరువైపులా నివసిస్తున్నవారు ఇబ్బందులు పడ్డారు. మురుగునీటి డ్రైనేజీ కాలువ నిండి మురుగునీరు, వర్షపునీరు ఏకమై రోడ్డుపైకి రావడంతో అవస్థలు పడ్డారు. ఇళ్ల ముందు చేరిన వర్షపు నీటిని డ్రైనేజీలోకి మళ్లించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త జైబున్నీ (75) ఆదివారం మృతి చెందింది. పట్టణంలోని 19 వార్డు గరీబ్‌నగర్‌కు చెందిన జైబున్నీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆదివారం మృతి చెందింది. ఈమెకు కుమారులు సచివాలయం కన్వీనర్ తప్పల్ జాకీర్, బాబాపక్రుద్దీన్, దాదాఖలందర్, మనువడు, మాజీ వర్క్స్ బోర్డు డైరెక్టర్ షేక్షావలి ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికేపరిమితమయ్యాడు.శ్రీనివాస్‌కు భార్య విశాలమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణ భారంకావడంతో స్నేహితులు శ్రీనివాస్ భార్య విశాలమ్మకు రూ.13,500 నగదు, బియ్యం బస్తా అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ స్నేహితులు బాల రాము, గోపి, ఖలీల్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ గాడిలో పడేనా..?



కూడేరు: మండలంలో నూతన మండల విద్యాధికారి రాకతో విద్యా వ్యవస్థ గాడిలో పడేనా.? అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఇంతక ముందు పని చేసిన ఎంఈఓ చంద్రశేఖర్ కాసులకు కక్కుర్తి పడి బాధ్యతలను గాలికొలిశారు. ఉన్నతాధికారి పర్యవేక్షణ లేక మండలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. పదోతరగతిలో ఉత్తీర్ణత శాతం ఏటా తగ్గుతూ వచ్చింది. ఎంఈఓపై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా విద్యాధికారి రెండు నెలల క్రితం విచారణ చేపట్టారు. అయినా ఆయన అక్రమార్జన మానుకోలేదు. గత నెల 17న రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఈ నెల 3న నూతన ఎంఈఓగా మహమ్మద్ గౌస్ బాధ్యతలు చేపట్టారు. పాఠశాలలను పర్యవేక్షణ చేస్తు విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరద ఉధృతికి తెగిపోయిన రోడ్డు



కణేకల్లు - మాల్యం మార్గమధ్యంలో తెగిపోయిన రోడ్డు

కణేకల్లు: వేదవతి హగిరిలో వరదనీటి ఉధృతికి కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగిరిపై ఇటీవల పునరుద్ధరించిన రోడ్డు మళ్లీ తెగిపోయింది. మండలంలో కురిసిన భారీ వర్షానికి కోణేకుర్తి చెరువు నిండి మరవ పారుతోంది. ఈ నీరు వేదవతి హగిరిలోకి వస్తుండటంతో వేదవతి హగిరి పొంగి ప్రవహిస్తోంది. ఈ నీటి ఉధృతికి కణేకల్లు–మాల్యం మార్గంమధ్యలో వేదవతి హగిరిపై ఉన్న రోడ్డు శనివారం రాత్రి తెగిపోయింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ప్రస్తుతం ఈ రోడ్డు దెబ్బ తినడంతో కణేకల్లు–ఉరవకొండకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఉరవకొండ నుంచి కణేకల్లు వైపు వచ్చే బస్సులు మాల్యం వరకు వచ్చి, అక్కడి నుంచే వెళ్లిపోతున్నాయి.

సారూ.. పల్లె గొంతు తడపరూ..

- పండుగ పూట తాగునీటి కోసం కటకట
- సమ్మెలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లోని పల్లెల గొంతు తడుపుతున్న శ్రీరామ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు వేతనాల కోసం సమ్మెబాట పట్టారు. దీంతో తాగునీటి సరఫరా ఆగిపోయి, పల్లెల్లో తాగునీటి కోసం అవస్థలు తప్పడంలేదు. కార్మికుల పూట గడవక, ప్రజల గొంతు తడవక..ప్రత్యామ్నాయం చూపేవారులేక అల్లాడుతున్నారు. తాగునీటి సరఫరా పథకం యాజమాన్యం, ప్రజాప్రతినిధులు సమస్యలపై చొరవచూపాలని ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

– కళ్యాణదుర్గం:



మారెంపల్లిలో నీటి కోసం స్థానికుల పాట్లు



వేతనాల కోసం సమ్మెలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు (ఫైల్)

కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతానికి శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఫేజ్–01, 03, 04 కింద ఉన్న కూడేరు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, మడకశిర ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. ఫేజ్–4 కింద కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో సుమారు 900 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోవడంతో ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దయనీయంగా కార్మికుల పరిస్థితి..

శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేసే సుమారు 600 మంది కార్మికుల కుటుంబ దుస్థితి దయనీయంగా మారింది. మందికి ఏడు నెలల వేతనం అందాల్సి ఉంది. 12 ఏళ్ల పీఎఫ్ డబ్బులు చెల్లించకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా కనీసం ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ కూడా కొట్టించుకోలేని దుస్థితిలో ఉన్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు వస్తే కుటుంబంలో సరుకులు కూడా తీసుకెళ్లలేని దయనీయంగా తమ బతుకులు ఉన్నాయని వాపోతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు కోరుతున్నా సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పల్లెలోనూ క'న్నీటి' కష్టాలు..

కళ్యాణదుర్గం మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల దాహార్తి తీర్చేందుకు ఆధారమైన శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీటి సరఫరా ఆగిపోవడంతో పండగ పూట కూడా క'న్నీటి' కష్టాలు తప్పవా? అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల అభివృద్ధికి బాటలు వేస్తామని చెప్పే ప్రజాప్రతినిధులు కాస్త చొరవ చూపి తాగునీటి సమస్య తీరేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కోసం అవస్థలు



నా పేరు ఆశాబేగం. మాది కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామం. గత నెల రోజులుగా తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. శ్రీరామిరెడ్డి తాగునీరే మాకు దిక్కు. పండుగలు వస్తే నీటి కొరత ఎక్కువగా ఉంటుంది. మంచినీటి సమస్యపై ఎవరూ పట్టించుకునే వాళ్లు లేరు. బిందె రూ.5 పెట్టి బయట కొంటున్నాం. నీటి సమస్య వెంటనే తీర్చాలి.

– ఆశాబేగం, గృహిణి, కొత్తూరు గ్రామం.

నీళ్లు ఇవ్వలేకపోతే ఎలా..?



అప్పుడేమో వినాయక చవితి పండుగకు తాగు నీళ్లవ్వలేదు..ఇప్పుడు దసరాపండుగ దగ్గర పడింది. ఇప్పుడు కూడా తాగునీరు రాలేదు. కార్మికులు జీతాల కోసం సమ్మెలో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అయినా చొరవ చూపి నియోజకవర్గ ప్రజలకు తాగునీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలి. పండుగ పూట కూడా తాగేకి నీళ్లు ఇవ్వలేకపోతే ఎలా..?

– చెలిమప్ప, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకుడు, కళ్యాణదుర్గం

కార్మికులను బెదిరించడం తగదు



శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకంలోని కార్మికులకు వేతనాలు ఇవ్వలేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కార్మికుల ఇళ్లు గడవడం కష్టంగా మారింది. వేతనాలు అడిగితే సదరు కాంట్రాక్టర్ ఉద్యోగాలు ఊడతాయని బెదిరిస్తున్నారు. వేతనాలు అందకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

– అచ్యుత్ ప్రసాద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

అప్పు కూడా పుట్టడంలేదు



కుటుంబం గడవాలంటే అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఏం తినాలి? ఎలా బతకాలి..? విధులకు వెళ్లాలన్నా ద్విచక్రవాహనానికి పెట్రోల్‌కు కూడా డబ్బు లేని పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్లు వెంటనే పెండింగ్ వేతనాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి.

– జి.బొమ్మయ్య, విలేజ్ ఆపరేటర్, మహంతపురం

బూదగవి సూర్యదేవుడికి అభిషేకం



అలంకరణలో బూదగవి సూర్యదేవుడు

ఉరవకొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బూదగవి సూర్యదేవుడి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామికి అభిషేకం, మహామంగళహారతి, కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పీఏబీఆర్‌లో 2.35 టీఎంసీల నీరు నిల్వ



పీఏబీఆర్ జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లో నీటి మట్టం పెరిగింది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి రోజుకు 306 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం నాటికి డ్యాంలో నీటి మట్టం 2.35 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అవుట్ ఫ్లో 95 క్యూసెక్కులు ఉందన్నారు.

7,8 తేదీల్లో సువార్త ఉజ్జీవ మహాసభలు

కంబదూరు: మండల కేంద్రంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఈనెల 7,8వ తేదీల్లో సువార్త ఉజ్జీవ మహాసభలు జరగనున్నట్లు చర్చి పాస్టర్ జేమ్స్ తెలిపారు. ఆదివారం సువార్త సభల పోస్టర్లను విడుదల చేశారు. రోజూ సాయంత్రం 6 గంటలకు చర్చి గ్రౌండ్‌లో జరగనున్న సభలకు ముఖ్య ప్రసంగీకులుగా బెంగళూరుకు చెందిన దైవజనులు జోయల్ ఎస్.బాబు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దినకర్, జాన్‌శాస్త్రి, ప్రభుదాసు, ఎస్.పాల్, విజయ్‌కుమార్, జకరయ్య, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4-జీ సేవలు ప్రారంభం



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 4జీ సిమ్ మేళా

రాయదుర్గంటౌన్: బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవంగా లభిస్తోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలు రీచార్జ్ ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తక్కువ రీచార్జ్ ధరలు ప్రకటించిన బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు. రాయదుర్గం బీఎస్ఎన్ఎల్ పరిధిలో వారంరోజుల క్రితం 4–జీ సేవలను ప్రారంభించారు. ప్రస్తుతం రాయదుర్గంలో 4 జీ సేవలు అందుబాటులోకొచ్చినట్లు మేనేజర్ హరికృష్ణ, జేటీవో గురురాజ్ తెలిపారు. నెట్‌వర్క్ పనితీరు డిసెంబర్ లోపు వంద శాతం మెరుగుపడుతుందన్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్లు గల నియోజకవర్గంలోని మిగతా ప్రాంతాల్లోనూ నెలరోజుల్లో 4–జీ సేవలు తెచ్చేందుకు టెక్నికల్, ఇన్‌స్టలేషన్ పనులు క్షేత్రస్థాయిలో జరుగుతున్నట్లు చెప్పారు. మరో నెల రోజుల్లోపు డి.హీరేహాళ్, సోమలాపురం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, కణేకల్లు క్రాస్, డి.హొన్నూరు, గనిగెర, గొల్లపల్లి, శ్రీధరఘట్ట ఏరియాల్లో బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలు ప్రారంభమవుతాయన్నారు. ప్రైవేట్ టెలికాం సంస్థలను వీడి జూన్ నుంచి భారీ స్థాయిలో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు వస్తున్నట్లు చెప్పారు.

రోడ్డుపై మొక్కజొన్న పంట ఆరబోత



బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామానికి వెళ్లే రోడ్డుపై రైతులు మొక్కజొన్న పంటను ఆరబెట్టారు. కర్ణాటక, ఆంధ్రా సరిహద్దు రహదారిపై స్థానిక రైతులు మొక్కజొన్న పంట నూర్పిడి చేసి, పంటను ఆరబోశారు. నేమకల్లు గ్రామానికి కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఈ మార్గంలోనే వస్తుంటారు. ఎదురుగా వాహనం వస్తే సైడుకు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. దీనికి తోడు క్రషర్ల నుంచి టిప్పర్లు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు, వాహనదారులు చెప్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించలేదని ఆమె తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ రెహమాన్ తెలిపాడు.

26,27 వార్డుల్లో లబ్ధిదారులకు అందని రేషన్



స్టోరు వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 26,27 వార్డుల్లోని కార్డుదారులకు రేషన్ అందలేదు. టీడీపీ అధికారంలో కొచ్చాక ఆ పార్టీ నాయకులు, సానుభూతి పనులకు చౌక ధాన్యపు డిపోలు కట్టబెట్టే క్రమంలో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించలేదు. వీరికి అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారు. దీంతో పట్టణంలోని 26,27 వార్డుల పరిధిలో వచ్చే 19వ స్టోరును గత నెల అధికారులు తనిఖీ చేసి బఫర్ తక్కువగా ఉందనే సాకుతో స్టోరు సీజ్ చేశారు. గత నెల ఐదు రోజులు రేషన్ పంపిణీ చేసి, వదిలేశారు. ఈనెల సరుకులు అందించలేదు. బియ్యం, చెక్కర సరఫరా చేస్తుండడంతో 680 మంది లబ్ధిదారు లకు దక్కలేదు. పొరుగున ఉన్న స్టోర్లకు వెళ్తే వెను క్కు పంపుతున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టోరు వద్ద సీపీఐ నిరసన : స్టోరు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. స్టోరుకు బియ్యం సరఫరా చేయకుండా స్టాక్ పాయింట్‌లో ఉంచి లబ్ధిదారులకు ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. దసరా పండుగకు రేషన్ అందించకపోతే ఎలా? అని సీపీఐ పట్టణ కార్యదర్శి క్రొత్రేష్ నిలదీశారు. రేషన్ ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత



బూదిగుమ్మలో అన్నపూర్ణాదేవి అలంకరణలో పద్మావతి అమ్మవారు



మల్లిపల్లిలో మీనాక్షిదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకరణలో భద్రకాళి



రూ.45 లక్షలతో ధనలక్ష్మి అలంకరణలో రాయదుర్గం కోటలోని వాసవీమాత

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు ఉదయం, సాయంత్రం భక్తులు భారీ సంఖ్యలో తరలిచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. నాల్గో రోజు ఆదివారం పట్టణంలోని కోటలో వెలసిన నగరేశ్వరి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లతో అమ్మవారి (దాదాపు రూ.45 లక్షలతో) అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ఓబుళాచారి రోడ్డులోని బన్ని మహంకాళమ్మ ఆలయం, శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామునే భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నేసేపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయం, హటకేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, కోటలోని కంసలవీధి వెలసిన కాళికాంబదేవి, లక్ష్మీబజార్‌లో వెలసిన ముదుగులమ్మ ఆలయాల్లో పూజలు చేశారు.

లలితా త్రిపుర సుందరిగా జగదీశ్వరి

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులోని జగదీశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామల ఆధ్వర్యంలో అమ్మవారి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సిండికేట్ బ్యాంకు వద్ద ఉన్న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త కొత్త శరత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కణేకల్లు: కణేకల్లులోని కనకదుర్గ ఆలయంలో ఆదివారం అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవీ ఆలయంలో ముకాంబికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కంబదూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను కంబదూరులో వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మీనాక్షి దేవి అలంకరణలో అమ్మవారు

కళ్యాణదుర్గం రూరల్: మల్లిపల్లి గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చౌడేశ్వరి అమ్మవారు మీనాక్షి దేవి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.

అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు దర్శనం

వజ్రకరూరు: స్థానిక లలితాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మారెమ్మ ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవిగా పద్మావతి అమ్మవారు

బెళుగుప్ప: మండల పరిధిలోని బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. బెళుగుప్పలో పెద్దమ్మ అమ్మవారు, విరూపాక్షేశ్వర బ్రహ్మంగారి మఠంలో పోలేరమ్మ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.



కణేకల్లులో గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు



లలితా త్రిపుర సుందరీగా జగదీశ్వరి అమ్మవారు



వజ్రకరూరులో లలితా త్రిపురసుందదేవి



కంబదూరులో మహాలక్ష్మి అలంకరణ



కంబదూరులో 20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



బొమ్మనహాళ్‌లో కలిసిన 2005-06 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వం'.. ఆత్మీయ సమ్మేళనం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో 10వ తరగతి 2005-06 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్, సుచరిత, నరసింహ, ఉషారాణిని సన్మానించారు. గురువులు మాట్లాడుతూ అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరడం గర్వంగా ఉందన్నారు. ఏళ్ల తర్వాత తమను గుర్తుంచుకొని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, అశోక్, యన్నప కందేపల్లి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. పాతికేళ్ల తర్వాత అందరూ ఒక్కటిగా కలవడంతో పాఠశాల ఆవరణ సందడి నెలకొంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మస్తానప్ప, టూషన్ మాస్టార్ రామాంజినేయులు, కిష్టప్ప, శివలింగప్ప, నీలి హనుమంతరాయుడు, నాగరాణి, మాధవీలత, పద్మావతిని సన్మానించారు.